నందినికి 5 లక్షలు

ఆసియా క్రీడల్లో కాంస్య పతకం నెగ్గిన యువ అథ్లెట్ అగసర నందినికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల ప్రోత్సహకాన్ని అందించింది. మంగళవారం ధర్మపురిలో నిర్వహించిన బహిరంగ సభా వేదికపై మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ నందినికి చెక్కు అందజేశారు. ఏడు క్రీడాంశాల సమాహారమైన హెప్టాథ్లాన్‌లో సత్తాచాటి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచిన నందినిని మంత్రులు ప్రత్యేకంగా అభినందించారు.

కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ షురూ..

ప్రారంభించిన క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, అక్టోబర్ 3: రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తున్నదని క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. యువకులు తమకిష్టమైన క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి మంత్రి శ్రీకారం చుట్టారు. ప్లేయర్లకు కిట్లను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 25 వేల గ్రామాల్లో కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల క్రీడా మైదానాలను పూర్తి చేశామన్నారు. ఉదయం, సాయంత్రం మైదానాల్లో క్రీడలు ఆడాలన్నారు. క్రీడాకారుల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నదన్నారు. అనంతరం సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ క్రీడలకు సర్కారు సముచిత స్థానం కల్పిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్, క్రీడా శాఖ డైరెక్టర్ కే.లక్ష్మి, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల పాటు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ కొనసాగుతుందని సాట్స్ చైర్మన్ ఆంజనేయ గౌడ్ తెలిపారు. వనపర్తి జిల్లాలో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, నిర్మల్ జిల్లాలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, హైదరాబాద్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు కిట్ల పంపిణీని ప్రారంభించారు. వందకోట్లకు పైగా బడ్జెట్ కేటాయించి కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నారని ఆంజనేయ గౌడ్ పేర్కొన్నారు.

కిట్‌లో ఏం ఉన్నాయంటే!

2 క్రికెట్ బ్యాట్లు	1 వాలీబాల్ నెట్
2 జతల బ్యాటింగ్ గ్లౌవ్స్	1 సైకిల్ పంప్
1 జత కీపింగ్ గ్లౌవ్స్ (లెదర్)	3 జతల డంబుల్స్
2 జతల బ్యాటింగ్ ప్యాడ్లు	1 డిస్కస్ త్రో
2 జతల కీపింగ్ ప్యాడ్లు	6 టెన్నికాయిట్ రింగ్స్
6 స్టంప్స్	4 స్కిప్పింగ్ రోప్స్
12 బంతులు	1 స్టాప్ వాచ్
4 సింథటిక్ వాలీబాల్స్	3 ప్లాస్టిక్ విజిల్స్
	75 టీషర్ట్‌లు

నవరత్నాలు

పదో రోజు 2 స్వర్ణాలు సహా 9 పతకాలు

ఆసియా గేమ్స్

ఆసియా క్రీడల్లో భారత మహిళా అథ్లెట్లు అసమాన పోరాట పటిమతో చరిత్ర సృష్టించారు. భారత క్రీడా యవనికపై సరికొత్త అధ్యాయం లిఖిస్తూ.. పసిడి కాంతులతో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. జావెలిన్ త్రోలో ఈటెను రికార్డు దూరం విసిరిన అన్ను రాణి మహిళల విభాగంలో దేశానికి తొలి స్వర్ణ పతకం అందించగా.. పారుల్ చౌదరి 5 వేల మీటర్ల పరుగులో పసిడి పతకం చేజిక్కించుకుంది. డెకథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ జాతీయ రికార్డు బద్దలు కొడుతూ వెండి పతకం కొల్లగొట్టగా.. మహమ్మద్ అఫ్సల్ 800 మీటర్ల పరుగులో రజతం కైవసం చేసుకున్నాడు. 400 మీటర్ల హర్డిల్స్‌లో విద్య, యువ బాక్సర్ ప్రీతి, నరేందర్ కాంస్యం దక్కించుకోగా.. ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్, కనోయ్‌లో అర్జున్ సింగ్-సునీల్ సింగ్ జోడీ కంచు మోత మోగించింది. వరల్డ్ చాంపియన్, ఒలింపిక్ విజేత బాక్సర్ లవ్లీనా కనీసం వెండి ఖరారు చేయగా.. ఆర్చరీలో ఒజాస్, అభిషేక్ ఫైనల్‌కు దూసుకెళ్లి భారత్‌కు స్వర్ణం ఖాయం చేశారు.

జావెలిన్ త్రోలో అన్ను రాణికి స్వర్ణం

5వేల మీటర్ల పరుగులో పారుల్‌కు పసిడి

హాంగ్జౌ: ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు వరుసగా మూడోరోజు పతకాల పంట పండించారు. అన్ను రాణి జావెలిన్ త్రోలో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన ఫైనల్లో అన్ను ఈటెను ఏకంగా 62.92 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచింది. దాంతో, జావెలిన్‌లో పసిడి పతకం ముద్దాడిన భారత తొలి మహిళగా రికార్డు సృష్టించింది. ఇక.. పారుల్ చౌదరీ తన పసిడి కల నిజం చేసుకుంది. 3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో కొద్దిలో స్వర్ణం చేజార్చుకున్న ఆమె 5 వేల మీటర్ల పరుగులో అదరగొట్టింది. 15 నిమిషాల14.75 సెకన్లలో లక్ష్యాన్ని చేరి గోల్డ్ మెడల్ చేజిక్కించుకుంది. ఫినిషింగ్ లైన్‌కు 40మీటర్ల దూరంలో అమాంతం వేగం పెంచిన పారుల్.. జపాన్ అథ్లెట్‌ను అధిగమించి విజేతగా నిలిచింది. 800 మీటర్ల పరుగులో మహమ్మద్ అఫ్సల్ 1నిమిషం48.43 సెకన్లతో వెండి పతకం దక్కించుకోగా.. పది ఈవెంట్ల పోటీ డెకథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ 7,666 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. 92 కిలోల విభాగంలో బాక్సర్ నరేందర్ బెర్వాల్, 54 కిలోల విభాగంలో యువ బాక్సర్ ప్రీతి పవార్ సెమీస్‌లో ఓడి కాంస్యంతో సరిపెట్టుకున్నారు. 400 మీటర్ల హర్డిల్స్‌లో విద్య కాంస్యంతో రెండో పతకం ఖాతాలో వేసుకుంది. కనోయ్ డబుల్స్‌లో అర్జున్ సింగ్, సునీల్ సింగ్ ద్వయం కాంస్య పతకంతో మెరవడంతో.. మంగళవారం పోటీలు ముగిసే సరికి భారత్ పతకాల సంఖ్య 69 (15 స్వర్ణాలు, 26 రజతాలు, 28 కాంస్యాలు)కి చేరింది.

అఫ్సల్ అదరహో..

800 మీటర్ల పరుగులో మహమ్మద్ అఫ్సల్ అదరగొట్టాడు. 1 నిమిషం 48.43 సెకనల్లో ఫినిషింగ్ లైన్‌కు చేరుకున్నాడు. మరో 0.38 సెకన్ల ముందు లక్ష్యాన్ని చేరుకొని ఉంటే గోల్డ్ మెడల్ ఒడిసిపట్టేవాడు. ఈ విభాగంలో సౌదీ అరేబియా అథ్లెట్ ఎస్సా అలీ క్వాజిన్ స్వర్ణం గెలుపొందాడు.

మరోవైపు పురుషుల బాక్సింగ్‌లో నరేందర్ బెర్వాల్ కాంస్యంతో మెరిశాడు. సెమీఫైనల్లో కజకిస్థాన్ బాక్సర్ కమ్షిబెక్ కుంకబయెవ్ చేతిలో 0-5తో ఓటమి పాలయ్యాడు. దాంతో, 19వ ఆసియా క్రీడల పురుషుల విభాగంలో పతకం కైవసం చేసుకున్న భారత బాక్సర్‌గా నరేందర్ రికార్డు లకెక్కాడు. స్టార్ బాక్సర్లు తేలిపోయిన చోట నరేందర్ తన పవర్ పంచ్‌తో పరువు నిలబెట్టాడు. యువ బాక్సర్ ప్రీతి పవార్ మహిళల 54 కిలోల విభాగంలో కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. సెమీఫైనల్లో చైనా బాక్సర్ చాంగ్ యువాన్ చేతిలో 0-5 పాయింట్ల తేడాతో ఓడి వెండి పతకం చేజార్చుకుంది.

ఫైనల్లో ఇద్దరు మనోళ్లే

ఆర్చరీ పురుషుల వ్యక్తిగత విభాగంలో భారత్‌కు పసిడి ఖరారైంది. ఒజాస్ ప్రవీణ్ డియోతలే ఆసియా క్రీడల రికార్డు బద్దలు కొడుతూ ఫైనల్‌కు చేరాడు. ప్రవీణ్ సెమీఫైనల్లోనూ 150 పాయింట్లతో దక్షిణి కొరియాకు చెందిన యాంగ్ జీవొన్‌ను చిత్తు చేశాడు. మరో మ్యాచ్‌లో అభిషేక్ వర్మ దక్షిణ కొరియాకే చెందిన జూ జీహూన్‌పై 147-145 తేడాతో గెలుపొందాడు. దీంతో ఫైనల్లో ఇద్దరు భారతీయుల మధ్య పోటీ జరుగనుంది.

తేజస్విన్‌కు సిల్వర్

పది క్రీడల ఈవెంట్ డెకథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ జాతీయ రికార్డు బద్దలు కొట్టి రజతం దక్కించుకున్నాడు. మొదట నిర్వహించిన లాంగ్ జంప్, హై జంప్, 400 మీటర్ల పరుగులో అగ్రస్థానంలో నిలిచిన శంకర్ మిగతా ఈవెంట్స్‌లో అదే జోరు కొనసాగించలేకపోయాడు. షాట్ పుట్, 110 మీటర్ల హర్డిల్స్, జావెలిన్ త్రోలో 5వ స్థానంలో.. పోల్‌వాల్ట్‌లో చివరి స్థానంలో నిలిచి 7,666 పాయింట్లతో సిల్వర్ మెడల్ అందుకున్నాడు.

విద్య డబుల్

అథ్లెటిక్స్‌లో విద్య రామరాజ్ డబుల్ ధమాకాతో అదరగొట్టింది. 400 మీటర్ల మిక్స్‌డ్ రీలేలో వెండి పతకం నెగ్గిన విద్య మంగళవారం మరో పతకంతో మెరిసింది. 400 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్యం కైవసం చేసుకుంది. ఫైనల్లో ఆమె 55.68 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని మూడోస్థానంలో నిలిచింది.

ప్రవీణ్‌కు కంచు

ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ కాంస్యం దక్కించుకున్నాడు. ఫైనల్లో 16.68 మీటర్ల ప్రదర్శనతో మూడో స్థానంలో నిలిచాడు. ఈ పోటీలో భారత్‌కే చెందిన అబూబాకర్ 16.62మీటర్లతో నాలుగో స్థానంలో నిలిచాడు. చైనాకు చెందిన యమింగ్ జూ, యావోకింగ్ ఫాంగ్ పసిడి, వెండి పతకాలు ఎగరేసుకుపోయారు.

పారుల్

కనోయ్ డబుల్స్‌లో కాంస్యం

కనోయ్ డబుల్స్‌లో 1000 మీటర్ల పోటీలో అర్జున్ సింగ్, సునీల్ సింగ్ సత్తా చాటారు. నీటి అలలపై రయ్ రయ్ మంటూ దూసుకెళ్లి దేశానికి కాంస్య పతకం అందించారు.అర్జున్, సునీల్ 3:53.329 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకున్నారు. ఈ పోటీల్లో ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్ వరుసగా పసిడి, వెండి పతకాలు చేజిక్కించుకున్నాయి.

లవ్లీనా సూపర్ పంచ్

స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గోహై మహిళల 75 కేజీల విభాగంలో ఫైనల్‌కు దూసుకెళ్లడంతో పాటు.. వచ్చే ఏడాది జరుగనున్న పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారు చేసుకుంది. సెమీస్‌లో లవ్లీనా 10-0తో థాయ్‌లాండ్ బాక్సర్ బ్లైసన్ మనీకోన్‌ను మట్టికరిపించింది. భారత మహిళల హాకీ జట్టు అద్భుత పోరాటంతో సెమీస్‌లో అడుగు పెట్టింది. మంగళవారం ఏకపక్షంగా జరిగిన క్వార్టర్ ఫైనల్లో హాంకాంగ్‌ను 10-0తో మట్టికరిపించింది. తద్వారా పతకం ఖారారు చేసింది. స్క్వాష్ పురుషుల సింగిల్స్‌లో సౌరభ్ ఘోషాల్ సెమీస్‌లో అడుగు పెట్టాడు. దీంతో అతడికి కనీసం కాంస్యం ఖరారైంది.

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	చైనా	161	90	46	297
2	జపాన్	33	47	50	130
3	కొరియా	32	42	65	139
4	భారత్	15	26	28	69
5	ఉజ్బెకిస్థాన్	14	15	21	50
6	చైనీస్ తైపీ	12	10	18	40

నోట్: దే-దేశం, స్వ-స్వర్ణం, ర-రజతం, కా-కాంస్యం, మొ-మొత్తం

ఈరోజు మరిన్ని...

ఆసియా క్రీడల్లో నేటి నుంచి రెజ్లింగ్‌తో పాటు పురుషుల జావెలిన్ పోటీలు ప్రారంభం కానున్నాయి. మల్లయుద్ధంలో మనవాళ్లకు తిరుగులేకపోగా.. ప్రపంచ చాంపియన్ నీరజ్ చోప్రా ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. ఇక పురుషుల హాకీ జట్టు సెమీఫైనల్లో కొరియాతో తలపడనుంది.

జైస్వాల్ సెంచరీ.. సెమీస్‌లో భారత్

యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (49 బంతుల్లో 100; 8 ఫోర్లు, 7 సిక్సర్లు) సెంచరీతో కదంతొక్కడంతో ఆసియా క్రీడల్లో భారత జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వార్టర్స్‌లో యువ భారత్ 23 పరుగుల తేడాతో నేపాల్‌ను చిత్తు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని భారత జట్టు.. 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. యశస్వి ఆరంభం నుంచే దంచికొట్టగా.. రుతురాజ్ (25), శివమ్ దూబే (25 నాటౌట్) పర్వాలేదనిపించారు. చివర్లో సిక్సర్ల వీరుడు రింకూ సింగ్ (15 బంతుల్లో 37 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్సర్లు) విధ్వంసం సృష్టించాడు. అనంతరం లక్ష్యఛేదనలో నేపాల్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 179 పరుగులకు పరిమితమైంది. భారత బౌలర్లలో అవేశ్ ఖాన్, రవి బిష్ణోయ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు.

జైస్వాల్ (100)

మళ్లీ వర్షమే!

భారత్, నెదర్లాండ్స్ వార్మప్ రద్దు



తిరువనంతపురం: పుష్కర కాలం తర్వాత స్వదేశంలో జరుగుతున్న వన్డే ప్రపంచకప్ కోసం మెరుగైన సన్నాహకాలు చేసుకుంటున్న టీమ్‌ఇండియాకు వరుణుడు నీడలా వెంటాడుతున్నాడు. ఇంగ్లండ్‌తో తొలి వార్మప్ మ్యాచ్‌కు వర్షం అడ్డుపడటంతో టాస్ పడ్డ తర్వాత మ్యాచ్ రద్దు కాగా.. మంగళవారం నెదర్లాండ్స్‌తో జరగాల్సిన పోరు ఒక్క బంతి పడకుండానే రద్దైంది. దీంతో టీమ్‌ఇండియా సుదీర్ఘ ప్రయాణం చేసి మరోసారి వర్షాన్ని ఆస్వాదించాల్సి వచ్చింది. మిగిలిన జట్ల ప్రాక్టీస్ మ్యాచ్‌లకు సైతం వరుణుడు అడ్డుపడ్డా.. రోహిత్ సేన మాత్రం రెండు మ్యాచ్‌ల్లో కలిపి ఒక్క ఓవర్ కూడా బౌలింగ్, బ్యాటింగ్ చేయలేదు. ఇక గురువారం నుంచి వన్డే ప్రపంచకప్‌నకు తెరలేవనుండగా.. టీమ్ ఇండియా తమ తొలిపోరులో ఆదివారం ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది.

పాక్ ఫుల్ ప్రాక్టీస్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా జరిగిన రెండో వార్మప్ మ్యాచ్‌లోనూ పాకిస్థాన్ పరాజయం పాలైంది. మంగళవారం ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో పరుగుల వరద పారిన పోరులో ఆస్ట్రేలియా 14 పరుగుల తేడాతో పాకిస్థాన్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 351 పరుగులు చేసింది. గ్లెన్ మ్యాక్స్‌వెల్ (77; 4 ఫోర్లు, 6 సిక్సర్లు), కామెరూన్ గ్రీన్ (50 నాటౌట్), ఇంగ్లిస్ (48) రాణించారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్థాన్ 47.4 ఓవర్లలో 337 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (59 బంతుల్లో 90 రిటైర్డ్ హర్ట్; 11 ఫోర్లు, 2 సిక్సర్లు) సుడిగాలి ఇన్నింగ్స్‌తో చెలరేగగా.. ఇఫ్తికార్ (83), నవాజ్ (50) ఆకట్టుకున్నారు. మరో మ్యాచ్‌లో శ్రీలంకపై అఫ్గానిస్థాన్ 6 వికెట్లతో విజయం సాధించింది.

గ్లోబల్ అంబాసిడర్‌గా సచిన్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌నకు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ 'గ్లోబల్ అంబాసిడర్'గా వ్యవహరించనున్నాడు. ఈ మేరకు అంతర్జాతీయ క్రికెట్ కమిటీ (ఐసీసీ) మంగళవారం వివరాలు వెల్లడించింది. భారత జట్టు తరపున 6 ప్రపంచకప్‌లు ఆడిన సచిన్.. గురువారం ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య జరగనున్న 13వ వరల్డ్‌కప్ తొలి మ్యాచ్‌కు ముందు ట్రోఫీని ఆవిష్కరించి టోర్నీ ప్రారంభమైనట్లు అధికారికంగా ప్రకటించనున్నాడు. 'నా మనసులో ఆ ట్రోఫీకి ప్రత్యేక స్థానం ఉంది. 1987 నుంచి 6 సార్లు వరల్డ్‌కప్ ఆడా. 2011లో విశ్వవిజేతగా నిలువడం నా కెరీర్‌లోనే అత్యంత గొప్ప క్షణం' అని సచిన్ పేర్కొన్నాడు. సచిన్‌తో పాటు మరో తొమ్మిది మంది ఈ వరల్డ్‌కప్‌కు అంబాసిడర్‌లుగా వ్యవహరించనున్నారు.

తలసాని చాలెంజ్ కప్ ప్రారంభం

మారేడ్‌పల్లి, అక్టోబర్ 3: క్రీడా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తుండటంతోనే.. రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నారని సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్‌తో కలిసి సాట్స్ చైర్మన్ మంగళవారం 'తలసాని చాలెంజ్ కప్' పేరిట రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టిన రోజు (అక్టోబర్ 6) సందర్భంగా గ్యాస్ మండిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.

నందిని కాంస్యం యువతకు ఆదర్శం: రమేశ్

నేరేడ్‌మెట్, అక్టోబర్ 3: ఆసియా క్రీడల్లో కాంస్య పతకం నెగ్గిన అగసర నందిని నేటి యువతకు ఆదర్శమని జాతీయ అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్ అన్నారు. చైనా వేదికగా జరుగుతున్న 19వ ఏషియన్ గేమ్స్ హెప్టాథ్లాన్‌లో కాంస్యం నెగ్గిన నందినిని మంగళవారం గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఘనంగా సన్మానించారు. నందిని అంతర్జాతీయ స్థాయికి ఎదగడంలో ప్రత్యేక కృషి చేసిన కోచ్ నాగపురి రమేశ్‌తో పాటు గోపీచంద్ తల్లిదండ్రులు పుల్లెల సుబ్బారావమ్మ, సుభాష్ చంద్రబోస్‌లు యువ అథ్లెట్‌ను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసియా క్రీడల్లో కాంస్యం సాధించిన నందిని.. రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావడంతో పాటు.. యువతక మార్గదర్శిగా నిలిచిందని అన్నారు.

ఐఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో జరిగిన జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలకు మంగళవారం నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.